# అప్పుల భారంతో అన్నదాత ఆత్మహత్య

**సంగారెడ్డి, అక్టోబరు 7, ప్రభాతవార్త:** వ్యవసాయ పంటల సాగుకై చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ అన్నదాన ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుంతమర్పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గొల్ల గోపాల్ (35) తనకు గల రెండు ఎకరాల భూమితో పాటు ఇంకో 4 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పంటలను సాగు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొంత కాలంగా వ్యవసాయంలో పెట్టిన పెట్టుబడులు తిరగిరాకపోవడంతో అప్పుల భారం అధికమైంది. గురువారం వ్యవసాయ పొలానికి చేరుకుని సాగు చేస్తున్న భూమి దగ్గరలోని చెట్టుకు ఉరిపెట్టుకుని మృతి చెందాడు. భార్య విజయం భర్త గోపాల్‌కు భోజనం తీసుకుని వ్యవసాయ పొలం వైపు వెళ్లగా భర్త గోపాల్ చెట్టుకు వేలాడుతూ కానవచ్చాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్‌రెడ్డి వివరించారు.




## స్వచ్ఛసర్వేక్షన్‌లో నర్సాపూర్ మున్సిపాలిటీకి 22వ ర్యాంక్

### మున్సిపల్ కమిషనర్ చాముండేశ్వరి

**నర్సాపూర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** స్వచ్ఛభారత్ మిషన్, స్వచ్ఛ సర్వేక్షన్ 2022లో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ర్యాంకింగ్స్‌లో నర్సాపూర్ మున్సిపాలిటీకి 22వ ర్యాంక్ రావడం జరిగిందని కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ 25 వేల జనాబా గల కేటగిరిలో దేశ వ్యాప్తంగా 327 మున్సి పాలిటీలకుగాను నర్సాపూర్ మున్సిపాలిటీకి 22వ ర్యాంక్ రావడం జరిగిందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తం గాగల 44 మున్సిపాలి టీలకుగాను 22వ ర్యాంక్ రావడం జరిగిందన్నారు.

**ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి :** ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ అన్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఫ్లెక్సీల ఏర్పాటుకు కేవలం మూడు రోజులకు మాత్రమే అనుమతి ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. శుక్రవారం నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బందిచే తొలిగించారు.



భాగ్యనగరంలోని యశోధ ఆసుపత్రిలో నాగరాజు మృతదేహానికి నివాళ్ళు అర్పిస్తున్న ఆసుపత్రి సిబ్బంది, (ఇన్‌సెట్‌లో నాగరాజు ఫైల్ ఫోటో)

## అవయవధాతకు కన్నీటి వీడ్కోలు

### శోకసంద్రంలో కుటుంబసభ్యులు,స్నేహితులు

**చిన్నశంకరంపేట,అక్టోబర్7, ప్రభాతవార్త:** ఉదయం లేచిన మొదలు సాయంత్రం వరకు కలిసి ఉన్న మిత్రుడు ఇక ఈ లోకంలో లేడు అంటే తట్టుకోవడం ఎవరి తరం కాదు. మరణిస్తూ కూడా అతని అవయవాలను దానం చేసి మరో ఐదు గురికి జీవం పోశాడు ఆ యువకుడు. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం అగ్రహారం గ్రామానికి చెందిన నాగరాజు(28) గడ్డీ వ్యాపారం చేసుకుంటూ భార్య మమత, అనావికలను పోషిస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి నాగరాజు పని మీద చిన్నశంకరంపేట నుండి చేగుంటకు మిత్రుడుతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. చేగుంట మండలం పోలంపల్లి వద్దకు వెళ్లగానే రోడ్డుకు అడ్డంగా గేదెలు రావడంతో వాటిని బలంగా ఢీ కోనడంతో తీవ్రగాయాలపాలైనారు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి వారి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వెంటనే నాగరాజును భాగ్యనగరంలోని యశోధ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. శుక్రవారం నాగరాజు పరిస్థితి విషమించి బ్రేయిన్ డెడ్ అయిందని డాక్టర్లు నిర్ధారించారు. అతని అవయవవాలను దానం చేయాలని కుటుంబసభ్యులకు డాక్టర్లు సూచించారు. కుటుంబసభ్యులు అవయవ దానం చేయాడానికి ముందుకు వచ్చారు. అనంతరం నాగరాజు మృతదేహానికి ఆసుపత్రి సిబ్బంది ఘనంగా నివాళ్ళు అర్పించారు. మృతదేహం చిన్నశంకరంపేటకు రాగానే అతని మిత్రులు ద్విచక్రవాహనాలపై ర్యాలీ చేపట్టారు. అవయవ దానంకు ఒప్పుకున్న నాగరాజు తల్లి ఎల్లమ్మ తండ్రి యాదగిరిలను మండల ప్రజలు అభినందించారు.

## పోడు భూముల సర్వే చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ శరత్



అగాహన సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** పోడు భూముల సమస్య శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, జిల్లాలో అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ హక్కులు చట్టాలు, ఆయా అధికారులు, కమిటీల పాత్ర, బాధ్యతలు, పోడు భూముల సర్వే, మొబైల్ యాప్‌లో అప్లోడ్ చేయడంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం నిబంధనల మేరకు పోడు భూములు సాగు చేసుకుంటున్న వారికి శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం ముందుకెళ్తున్నదని అన్నారు. తేదీ: 13-12-2005 కు ముందు నుండి భూముల్లో ఉన్నవారు అర్హులని తెలిపారు. పోడు భూముల సర్వే దరఖాస్తుదారుల వివరాల అప్లోడ్ తదితర ప్రక్రియ కసరత్తు వేగవంతం చేయాలని సూచించారు. ప్రాపర్‌గా వెరిఫికేషన్ చేయాలని, తిరస్కరిస్తే దానికి కారణాలు లిఖితపూర్వకంగా ఉండాలని తెలిపారు. అధికారులు ఎటువంటి పొర పాట్లు జరగకుండా చూడాలన్నారు. జిల్లాలో 52 గ్రామపంచాయతీలలోని 75 ఆవాస ప్రాంతాలలో 7109 ఎకరాలకు సంబంధించి 3934 క్లెయిమ్‌లు వచ్చాయని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీరాజ్, అటవీశాఖలు సమన్వయం చేసుకుంటూ ఏంపిడిఓలు గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి, 2005 కంటే ముందు పోడు భూములు సాగుచేస్తున్న గిరిజనులను. మూడు తరాల (75 సంవత్సరాలు) నుండి పోడు భూములను సాగుచేస్తున్న గిరిజనేతరులకు సంబంధించిన క్లెయిమ్‌లను గ్రామస్థాయి కమిటీలో, క్షేత్రస్థాయిలో క్లెయిమ్ దారు సమక్షంలో సర్వే చేయాలని, ఆయా స్థాయి కమిటీలలో తీర్మానాలను, రిజిస్ట్రల్లో పక్కాగా నమోదు చేయాలన్నారు. అదేవిధంగా దరఖాస్తుదారులు తమవద్ద గల పూర్తి ఆధారాలతో ఆ రోజు అధికారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఆయా గ్రామాలలో ముందు రోజు టామ్ టామ్ ద్వారా తెలియజేయాలని సూచించారు. అటవీశాఖ అధికారులు పంచాయతీ కార్యదర్శులు సంయుక్తంగా పనిచేయాలని, పనులు పూర్తయ్యే వరకు హెడ్ క్వార్టర్స్‌లో ఉండాలని సూచించారు. మొబైల్ యాప్‌ల ఒసర్వే చేయడంపై పవన్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి మోహన్‌రావు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి ఫిరంగి, రెవెన్యూ డివజనల్ అధికారులు, అటవీశాఖ అధికారులు, డిఎల్‌పిఓలు, ఎంపీడీవోలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు : ఎమ్మెల్యే

**నర్సాపూర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీకి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్ర వారం క్యాంపు కార్యాలయంలో టిఆర్ఎస్(బిఆర్ఎస్) నాయకుల సమక్షం లో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం కెసిఆర్‌ను ప్రధానమంత్రిగా చూసే రోజులు వస్తాయన్నారు. కెసిఆర్ పట్టుదలగల వ్యక్తి అని, ఏదైనా సాధించగలరని తెలిపారు. మహారాష్ట్ర నుంచి దేశ రాజకీయ ప్రస్థానం ప్రారంభిస్తారని ఆయన ప్రకటించారని చెప్పారు. కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు శ్రీధర్‌గుప్త, అశోక్‌గౌడ్, జడ్పి కోఆప్షన్ సభ్యులు మన్సూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ నహిమొద్దీన్, పిఏసిఎస్ చైర్మన్ రాజుయాదవ్, మాజీ ఎంపిటిసీ మల్లేష్‌యాదవ్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బోగ చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షులు బిక్షపతి, ఏఎంసి డైరెక్టర్‌లు జ్ఞానేశ్వర్, సాగర్, సూరారం నర్సింలు, కౌన్సిలర్ రాంచందర్, మాజీ ఎంపిపి శ్రీనివాస్‌గౌడ్,నాయకులు ఆంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మదన్‌రెడ్డి

# ఆగని ఇసుక అక్రమ రవాణ

## కాగితాలకే వాల్టా చట్టం పరిమితం, పట్టించుకోని అధికారులు

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 7,ప్రభాతవార్త:** ఇసుక అక్రమ రవాణాకు సంగారెడ్డి నియోజకవర్గం స్వర్గదామంగా మారింది. దోచుకున్నడికి దోచుకున్నంత అన్నచందగా మారిందనే ఆరోపణలున్నాయి. అధికారులను మచ్చిగ చేసుకుంటే తమ వ్యాపారానికి డోక ఉండదనే పరిస్థితి నెలకొందని, ఆయా గ్రామాల ప్రజలు నుండి ఆరోపణలు వస్తున్నాయి. అక్రమాలను ఆరికట్టాల్సిన అధికారులు నిద్రపోతుంటే అక్రమ రవాణ యథేచ్ఛగా సాగుతుందని వారు ఆరోపిస్తున్నారు. కంది మండంలోని వివిద గ్రామాలలో ఇసుక ఆక్రమ రవాణ బహిరంగా రహస్యంగా మారినా, అడ్డుకునే వారు కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఇసుక అక్రమ రవాణా అడ్డుఆదుపులేకుండా సాగుతుందని వారు ఆరోపిస్తున్నారు. పగలు రాత్రి తేడాలేకుండా అక్రమ ఇసుక రవాణ జరుగుతున్న స్థానిక అధికారులుపట్టించుకోవడంలేదని సంగారెడ్డి నియోజకవర్గంలోని కంది మండలం బ్యాతోల్ పరిసర గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణ గురించి అధికారుల దృష్టికి తెచ్చిన పట్టించుకోవడంలేదని స్థానికులు పులువురు ఆరోపిస్తున్నారు. వాల్టా చట్టానికి తూట్లు పోడుస్తూ, ఇసుకను తయారు చేసి తరలిస్తున్న విషం బహిరంగ రహస్యం అయినా పట్టించుకోవడంలేదని అన్నారు. యథేచ్ఛగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని అయినా సంబంధిత అధికారులు తమకేమి పట్టినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. బ్యాతోల్ గ్రామ సమీపంలోని వాగులోని నీటిని వినియోగిస్తూ ఇసుక తయారు చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. వాగు సమీపంలో ఇసుకను తయారు చేయడానికి ఒక సిసి బెడ్‌ను తయారు చేసి, దానిపై జాలిని వేశారని, ఆజాలిపై నిల్వ ఉంచిన మట్టిని వేసి దాన్ని, వాగులోని నీటిని మినియోగించి,కడిగి ఇసుక తయారు చేస్తున్నారని, అక్కడ ఏర్పాటు చేసిన గుంతలో నిండిన ఇసుకను యంత్రం సహాయంతో ఆరుబయటకు తరలించి నిల్వ చేస్తున్నారని, అలా, నిల్వచేసిన ఇసుకను టన్ను చొప్పున వ్యాపారులకు విక్రయిస్తున్నారని తెలి పారు. రోజు సుమారు ఇరవై లారీల వరకు ఇక్కడి నుండి ఇతర ప్రాంతాలకు ఇసుకను తరలిస్తారని, సాయంత్రం నుండి రాత్రి వరకు వాహనాల ద్వారా తరలిస్తారని, ఇందులో కొన్ని వాహనాలు, లక్డారం, బేగంపేట, ఇస్మాయిల్ ఖాన్‌పేట గ్రామాల మీదుగా తరలిపోతయాని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని సంబందిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. ఇసుత తరలింపులో అధికారుల ప్రమేయం లేనిదే, ఇంతా దర్జాగా తరలింపు సాధ్యం కాదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాల్టా చట్టం ఇక్కడ కాగితాలకే పరిమితమైందని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి ఇసుక అక్రమ రవాణను ఆరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. రవాణాను ఆడ్డుకట్ట వేయవచ్చునని వారు అభిప్రాయపడుతున్నారు.



తరలించడానికి సిద్ధం చేసిన ఇసుక

ఈ విషయమై కంది తహసిల్దార్ విజయలక్ష్మిని వివరణ కోరగా ఆర్ఐలను బ్యాతోల్‌కు పంపించి చర్యలు తీసుకుంటామని అన్నారు. మాముళ్ల తీసుకుంటున్నారనే విషయంలో వాస్తవంలేదని అన్నారు.

### ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణే

# పోలీసుల కర్తవ్యం

## సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

**ములుగు, అక్టోబర్ 7 (ప్రభాతవార్త):** విధి నిర్వహణలో పోలీసులు అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని, ప్రజల ధన మాన ప్రాణ రక్షణే మన పోలీసుల ముఖ్య కర్తవ్యమని సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. ములుగు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సిపి శ్వేత సందర్శించి తనిఖీ చేశారు. ముందుగా పోలీస్‌స్టేషన్ మొత్తం కలియతిరిగి స్టేషన్ ఆవరణ పచ్చదనం, పరిశుభ్రతతో ఆహ్లాదకరంగా ఉందని ఎస్ఐ రంగ కృష్ణను ఆమె అభినందించారు. స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సిసి కెమెరాల పనితీరును ఆమె గమనించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న సిడి ఫైల్స్, పెండింగ్‌లో ఉన్న సిడి ఫైల్స్, గ్రేవ్ కేసుల్లో ఉన్న సిడి ఫైల్స్ రికార్డులను పరిశీలించి గత మూడు సంవత్సరాలుగా నమోదు అవుతున్న కేసుల్లో ఎక్కువ శాతం ఏ తరహా కేసులు నమోదు అయ్యాయని ఎస్ఐ రంగ కృష్ణను అడిగి తెలుసుకున్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి త్వరగా డిస్పోజల్ చేయాలని ఎస్ఐని ఆదేశించారు. అనంతరం సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వారికి ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది పోటీపడి అంకిత భావంతో విధులు నిర్వహించే వారికి రివార్డులు, అవార్డులు ప్రతినెలా ఇవ్వడం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని సిబ్బందికి ఆమె సూచించారు. స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకొని తక్షణమే వారికి సేవలు అందించాలన్నారు. రౌడీలు, కేడీలు, అనుమానితులు, సంఘ విద్రోహ శక్తులపై నిరంతరం నిఘా ఉంచి వారి కదలికలను గమనించాలని, రాత్రి పెట్రోలింగ్ అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలని, విధి నిర్వహణలో రోల్ క్లారిటీ, గోల్ క్లారిటీ ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలని ఆమె అన్నారు. ప్రజల రక్షణ గురించి ఎల్లవేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని అన్నారు. విపిఓ పోలీస్ ఆఫీసర్ వారంలో రెండు మూడు సార్లు సంబంధిత గ్రామాలను సందర్శించి ప్రజలకు ఉన్న సమస్యలపై అడిగి తెలుసుకోవాలని ఆమె అన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్రైమ్ మరియు క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టం ద్వారా ప్రతి దరఖాస్తును, ఎఫ్ఐఆర్‌లను సిడిఎఫ్, పార్ట్-1, పార్ట్-2 రిమాండ్ సిడి, చార్జ్‌షీట్, కోర్టు డిస్పోజల్ ఆన్‌లైన్‌లో ప్రతి రోజు ఎంటర్ చేయాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి క్రైమ్ రేట్ తగ్గించేవిధంగా ప్రతి కేసులో క్లారిటీ ఉండాలని సూచించారు. రికార్డులు మరియు సిడి ఫైల్స్‌లో ఇన్వెస్టిగేషన్ ఎస్‌ఓపి ప్రకారం క్రమ పద్దతిలో ఫైల్స్ అన్ని ఉన్నందున ఎస్ఐ మరియు సిబ్బంది పనితీరును ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి రమేష్, గజ్వేల్ రూరల్ సిఐ రాజశేఖర్‌రెడ్డి, ఏఎస్ఐలు శంకర్, నాగేశ్వర్‌రావు, శివకుమార్, ప్రేమ్‌రాజ్, ఆండాలు, హెడ్ కానిస్టేబుళ్ళు రవీందర్‌రెడ్డి, శేఖర్, సలీమ్, అంజయ్య, రాంబాబు, మధుసూదన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ములుగు పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న సిపి శ్వేత



అక్బర్‌పేట చౌరస్తాలో డీసీసీబీ బ్యాంకు వద్ద బిజెపి, టిఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం

# ప్రొటోకాల్‌పై రగడ

### మంత్రి కటౌట్ పెట్టి, ఎమ్మెల్యేను అవమానించారని ఆగ్రహం

### డీసీసీబీ బ్యాంకు వద్ద ఉద్రిక్తత వాతావరణం

**మిరుదొడ్డి, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల పరిధిలోని అక్బర్‌పేట చౌరస్తాలో నూతనంగా నిర్మించిన డీసీసీబీ బ్యాంకు భవన ప్రారంభోత్స కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో బిజెపి, టిఅర్ఎస్ శ్రేణుల మధ్య కొంత సేపు వాగ్వివాదం శుక్రవారం చోటు చేసుకుంది. ఫ్లెక్సీలలో ఎమ్మెల్యే ఫోటోను ప్రొటోకాల్ పాటించకుండా అవమానించారని బిజెపి శ్రేణులు ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమక్షంలో టిఅర్ఎస్ శ్రేణులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఒక్కసారి బిజెపి, టిఅర్ఎస్ శ్రేణుల మధ్య గొడవ చోటు చేసుకోవడంతో ఎమ్మెల్యే పార్టీ శ్రేణులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలంటూ డీసీసీబీ అధికారులకు సూచించగా టిఅర్ఎస్ శ్రేణులు ఎలా ఫ్లెక్సీలు తొల గిస్తారు అంటూ బిజెపి శ్రేణులపై గొడవకు దిగారు. ఈ క్రమంలో రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు రాగానే టిఆర్ఎస్, బిజెపి శ్రేణులు పోటాపోటీగా నినాదాలు హోరెత్తించారు. దీంతో ఒక్కసారి ఉద్రిక్త వాతావరణం చోటు చేసుకుంది. మంత్రి హరీష్‌రావు డీసీసీబీ బ్యాంకు ప్రాంగణం వద్దకు వచ్చి ఎమ్మెల్యే లేకుండానే ఎంపి, డీసీసీబీ చైర్మన్‌తో కలిసి డీసీసీబీ బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభించి వెళ్లిపోతున్న క్రమంలో బయట నిలుచున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు మంత్రిని ఇదేం పద్దతి అని నిలదీశారు. దీంతో మంత్రి అసహనంతో ఎమ్మెల్యేతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు. పోలీసులు కలగజేసుకుని ఇరుపార్టీల శ్రేణులను శాంతింపచే యడంతో గొడువ సద్దుమణిగింది.

**ప్రోటోకాల్ పాటించకుండా అవమానించడం సరికాదు**

దుబ్బాక, మిరుదొడ్డి మండలాలలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు విచ్చేసిన మంత్రి హరీష్‌రావు ప్రోటోకాల్ పాటించకుండా స్థానిక ఎమ్మెల్యేనైన తనను అవమానించడం సరికాదని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం అక్బర్‌పేట చౌరస్తాలో నూతనంగా నిర్మించిన డీసీసీబీ బ్యాంకు భవనాన్ని ప్రారంభోత్సవానికి వస్తున్న మంత్రి కోసం తను లేకుండానే సరాసరి వెళ్లి ప్రారంభించి తనను అవమానించడం మంచి సంప్రదాయం కాదన్నారు.

# రాష్ట్ర సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

## మంత్రి తన్నీరు హరీష్‌రావు

**దుబ్బాక, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** సిఎం కెసిఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో సంక్షేమ పథకాల అమలులో దేశానికే అదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు అన్నారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ అత్మ కమిటీ, చైర్మన్, దౌల్తాబాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, తొగుట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. కాలమైన కాకపోయినా..తెలంగాణ రాష్ట్రంలో రెండు పంటలు పండిస్తున్నారని తెలిపారు. తాగు, సాగునీరు ఇచ్చి దుబ్బాక నియోజకవర్గం గోస తీర్చిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. జై జవాన్-జై కిసాన్ అనే నానుడి లేకుండా ఓ వైపు రైతులను గోస పెట్టి మరో వైపు సైనికులకు కూడా అగ్నిపథ్‌తో దేశ యువతను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని మండిపడ్డారు. విద్యుత్ మీటర్ల నిబంధన లేకపోతు రాష్ట్రానికి యేటా రూ.6 వేల కోట్లు రెండేళ్లలో రూ.12 వేల కోట్లు ఎందుకు నిలిపివేశారో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. చట్టంలో విద్యుత్ మీటర్లు లేకపోతే రెండేళ్లలో రాష్ట్రానికి రావాల్సిన రూ.12 వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు రైతుబంధు, రైతు బీమా 24 గంటల ఉచిత కరెంటు అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు బిజెపి పాలిత రాష్ట్రాలలో లేవన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ల ధరను విపరీతంగా పెంచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు కోతలు, వాతలు తప్ప ఇచ్చిందేమీ లేదన్నారు. మరో 15 రోజుల్లో ఎన్నికల కమిషన్ అమోద ముద్ర వేయగానే టిఅర్ఎస్ బిఅర్ఎస్‌గా మారుతుందన్నారు. మెదక్ ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ వేలేటీ రోజాశర్మ, డిసిసిబి చైర్మన్ దేవేందర్‌రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ బక్కి వెంకటయ్య, ఎంపిపి కొత్త పుష్పలత, జడ్పీటిసి కడతల రవీందర్‌రెడ్డి, తొగుట మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి,నాయకులు మనో హర్‌రావు, దుబ్బాక నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు దుబ్బాక అత్మకమిటీ చైర్మన్‌గా భాస్కరాచారి, తొగుట ఎఎంసి చైర్మన్‌గా కొమురయ్య, దౌల్తాబాద్ ఎఎంసి చైర్మన్‌గా ఇప్ప లక్ష్మీలు మంత్రి హరీష్‌రావు సమక్షంలో ప్రమాణ సీ ్వకారం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

**నర్సాపూర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన నర్సాపూర్ బస్టాండ్ సమీపంలో శుక్రవారం జరి గింది. సంఘటన వివరాలు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం... నర్సాపూర్ పట్టణానికి చెందిన చిత్తారి శేకమ్మ బంధువుతో కలిసి ఎక్సెల్ బైక్‌పై నర్సాపూర్ బస్టాండ్ నుంచి ఇంటికి వెళుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో బస్టాండ్‌కు కొద్ది దూరంలో రోడ్డుపై నిలుచున్న కారును బైక్ ఢీకొట్టిందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైనట్లు తెలిపారు. వీరిని 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా ఆసు పత్రికి తరిలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం వీరు ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

## అక్రమంగా నిల్వ ఉంచి బాణసంచా లభ్యం

### కేసు నమోదు

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** పట్టణంలోని బెజగం రాజ్ కుమార్ కిరాణం దుకాణంలో అక్రమంగా నిల్వవుంచిన టపాసులను పట్టుకున్నట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ శుక్రవారం తెలిపారు. టపాసులు నిల్వవు న్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు చేశామని, 1.20 లక్షల విలువ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ప్రభుత్వ అనుమతులు లేకుండా టపాసులు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ సుభాష్‌గౌడ్ హెచ్చరించారు.

## మొద్దు నిద్రలో మున్సిపల్ అధికారులు

### మున్నాళ్ళ ముచ్చటగా మారిన ప్లాస్టిక్ నిషేధం

**సంగారెడ్డి మున్సిపాలిటి అక్టోబరు 7, ప్రభాతవార్త:** సంగారెడ్డి మున్సిపాలిటిలో ప్లాస్టిక్ నిషేదం కాగితాలకే పరిమితమైంది. ప్లాస్టిక్ నిషేదం ఆమలు మున్నాళ్ళ ముచ్చటగా మారింది.అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాలు ఇక్కడ అటకెక్కాయి. గత జూలై 1నుండి ప్లాస్టిక్‌ను నిషేదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.దీన్ని అతిక్రమిస్తే భారీ ఎత్తున జరిమానాలు విధించే వీలుకల్పించింది.కాని స్థానికంగా అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్లాస్టిక్ వాడకం యదావిధిగా సాగుతుంది. రోజు ప్లాస్టిక్ వినియెగం యదేచ్ఛగా జరుగుతున్న అరికట్టాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు.ప్లాస్టిక్ నిషేదం ప్రారంభంలో చూపిన శ్రద్ద చూపిన అధికారులు, రానురాను అసిక్తిని తగ్గించారు. ప్లాస్టిక్ నిషేదం అమలు తమపని కాదన్నట్లుగా, సంబందిత అధికారులు వ్యవహరిస్తుండటంతో ప్లాస్టిక్ మినియెగం బహిరంగ రహస్యంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.నిషేదించిన ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన అధికారులు అవినీతి,నిర్లక్ష్యం, మొద్దునిద్ర కారణంగా హోల్‌సేల్ విక్రయదారుల ఆగడాలు యదావిధిగా సాగుతున్నాయని స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వం దశలవారీగా మున్సిపాలిటీలు,పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేదానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. 40మైక్రానన్ల కంటే తక్కువ పరిమాణం కలిగిన కవర్లు నిషేదించారు.గతేడాది సెప్టెంబర్ 1నుండి 75 మైక్రాన్లలోపు ఉన్నవి నిషేదించారు.ఈఏడాది జూలై 1 నుండి 120 మైక్రాన్లకు పెంచి దశల వారీగా నిషేదించాలని భావించింది. నిషేదిత ప్లాస్టిక్‌ను విక్రయించే విక్రయదారులకుజరిమానాలు విధించే అదికారాన్ని సంబందిత అధికారులకు అప్పగించింది ప్రభుత్వం. నిషేదాన్ని ఆమలు చేయాల్సిన అధికారుల మొద్దు నిద్ర వీడకపో వడంతో నిషేదం నామమాత్రంగా మారింది. సంబందిత ఉన్నతా దికారులు తగిన చర్యలు తీసుకొని ప్లాస్టిక్‌నిషేదం ఆమ లుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకొవాలని స్థానికులు కోరుతున్నారు. సంగారెడ్డి సానిటరి ఇన్స్‌పెక్టర్ సైదులును వివరణ కోరగా గ్యాప్ వచ్చిన మాట వాస్తవమేనని, తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.


దామోదర రాజనర్సింహను కలిసిన పటాన్‌చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్

## దామోదర రాజనర్సింహకు దసరా శుభాకాంక్షలు

**పటాన్‌చెరువు, అక్టోబరు 7, ప్రభాతవార్త:** ఉమ్మడి రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, కాంగ్రెస్ రాష్ట్ర ఎలక్షన్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ దామోదర రాజనర్సింహను పటాన్‌చెరువు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ కలుసుకుని దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రికి కాట శ్రీనివాస్ గౌడ్ శాలువా కప్పి సత్కరించారు. హైద్రాబాద్‌లోని దామోదర రాజనర్సింహ నివాస గృహంలో కలుసుకున్న శ్రీనివాస్‌గౌడ్‌ను నియోజకవర్గంలో కాంగ్రెస్ స్థితిగడులపై ఆరా తీశారు.

## పిహెచ్‌సికి వాటర్ ఫిల్టర్, ఆశలకు యూనిఫాంలు

-ఎంపిపి అధ్యక్షులు రవీందర్‌గౌడ్


యూనిఫాంలను అందజేస్తున్న ఎంపిపి రవీందర్‌గౌడ్

**జిన్నారం, అక్టోబరు 7, ప్రభాతవార్త:** జిన్నారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వాటర్ ఫిల్టర్‌ను, ఆశా వర్కర్లకు యూనిఫాంలను శుక్రవారం ఎంపిపి అధ్యక్షులు రవీందర్‌గౌడ్ పంపిణి చేశారు. ఈ సందర్బంగా ఎంపిపి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వస్తున్న రోగుల గొంతులు ఎండిపోకుండా ఉండేందుకు వాటర్ ఫిల్టర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆసత్రికి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రి పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు యూనిఫాంలను అందచేశారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యురాలు విద్యా ధరణి, మాజీ ఎంపిటిసి సభ్యులు పుట్టి, నాయకులు భాస్కర్, బండి మహేందర్, అశోక్ యాదవ్, శ్రీశైలం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వసంత నగర్‌లో వ్యక్తి అదృశ్యం

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని వసంత నగర్ కాలనీకి చెందిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన సెప్టెంబరు 29న ఉదయం 9గంటల ప్రాంతంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్ఐ బి రమేష్ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు...కాలనీకి చెందిన నీలి ఖబీర్ దాస్ (55)కు మతి స్థిమితం అంతంత మాత్రంగా ఉంది. సెప్టెంబరు 29న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఖబీర్ దాస్ రాత్రి వరకు తిరిగి రాలేదన్నారు. తమ బంధువులు, సన్నిహితుల వద్ద ఆచూకి కోసం వెతికినా ఫలితం దక్కలేదన్నారు. అదృశ్యమైన ఖబీర్ దాస్ కుటుంబ సభ్యులు నీలి ఈశ్వర్ శుక్రవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్ వివరించారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకి కానవస్తే సంగారెడ్డి పోలీసు స్టేషన్ 08455-276333 లేదా ఎస్ఐ 9490617010కు సమాచారం అందించాలని ఎస్ఐ రమేష్ సూచించారు.

## తుల్జాపూర్‌కు మిర్జాపూర్ భక్తుల పాదయాత్ర

**న్యాల్‌కల్, అక్టోబరు 7, ప్రభాతవార్త:** మహారాష్ట్రలోని తుల్జాపూర్‌లో కొలువున్న స్వయంభూవు తుల్జా భవాని అమ్మవారిని దర్శిం చుకునేందుకు మండలంలోని మిర్జాపూర్(ఎన్) గ్రామం నుంచి భక్తులు శుక్రవారం పాదయాత్రగా పయనమయ్యారు. గ్రామంలోని హనుమాన్ మందిరంలో పూజా కార్యక్రమాలు నిరహించి పాదయాత్రతను ప్రారంభించగా గ్రామస్థులు వీడ్కోలు పలికారు. పాదయాత్రగా వెళుతున్న భక్తులు మార్గ మద్యలో గల మండలంలోని రేజింతల్ గ్రామ శివారు లోని శ్రీ సిద్దివినాయక ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి పయనమయ్యారు. ఈ నెల 12వ తేదీ వరకు తుల్జాపూర్‌కు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కు బడులు చెల్లించుకుంటామని పాదయాత్రగా వెళుతున్న బర్ల శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గురువారం మండలంలోని ఆయా గ్రామాల నుంచి వందల సంఖ్యలో భక్తులు తుల్జాపూర్‌కు పాయదత్రగా వెళ్లారు.

# 'రాణా'కు కూతవేటు దూరంలో పేకాట జోరు

హుస్నాబాద్,అక్టోబరు7,ప్రభాతవార్త

స్థానిక హుస్నాబాద్ పట్టణ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో పేకాల జోరుగా సాగుతుందని సమాచారం.సమీపంలోనే పోలీస్‌స్టేషన్ ఉన్నా కూడా ఏమాత్రం జంకకుండా యువత ఒకచోట గుమికూడి పేకాటను జోరుగా సాగిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తెలిసింది.అయితే పట్టణంలోని అద్దెకు ఇచ్చిన ప్రెస్‌క్లబ్‌భవన్‌కు సమీపంలో ఒక సంఘం భవనంలోని ఖాళీ స్థలంలో ఈ పేకాటను సాగిస్తున్నట్లు వినికిడి.

**రాకీయఅండదండలతో హుస్నాబాద్‌లో స్నూకర్ కేంద్రాలు**

పక్కా రాజకీయఅండదండలతో హుస్నాబాద్ పట్టణంలోని సిద్దిపేట,హన్మకొండ రహదారిలోని అద్దెకు తీసుకుని యధేచ్ఛగా కొనసాగిస్తున్నట్లు తెలిసింది.స్నూకర్ కేంద్రంలో ప్రధానంగా బెట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు సమాచారం.తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన కొంత మంది ప్రముఖులు కాసినో,జూదం లాంటి క్రీడలను శ్రీలంక, గోవా కేం ద్రాల్లో నిర్వహిస్తుంటే ఈ ప్రాంత యువత తమకు తోచిన స్థాయిలో హుస్నాబాద్‌లో స్నూకర్ కేంద్రాలను నెలకొల్పి బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు సమాచారం.పట్టణంలో యువత సాయంత్రం వేళల్లో తమ పనులను ముగించుకుని వచ్చి స్నూకర్ కేంద్రాల్లో బెట్టింగ్‌లతో ఆటలు ఆడుతూ సేదతీరుతన్నట్లు తెలిసింది.ఇందుకు ము ఖ్యంగా మండలంలోని అధికార పార్టీలకు చెందిన ప్రముఖులు అండ దండలతోనే స్నూకర్ క్రీడల్లో బిజీగా గడుపుడుతన్నట్లు సమాచారం. హుస్నాబాద్ పట్టణంలో పోలీసులు దృష్టిసారించి ఈ అక్రమ జూ దంపై ఉక్కుపాదం మోపాలని పలువురు స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తు న్నారు. ఇందుకోసం పోలీస్‌శాఖ ఇంటలిజెన్స్ సిబ్బందిని వినియో గించుకుని దృష్టి సారించాల్సి న అవసరం ఎంతైనా ఉంది.


హుస్నాబాద్ పట్టణంలోని స్నూకర్ కేంద్రం దృశ్యం

# జాతీయ పంచాయతీ అవార్డ్స్‌కు వివరాలు నమోదు చేయాలి

## అదనపు కలెక్టర్ రాజర్షి షా

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** జాతీయ పంచాయతీ అవార్డ్స్ పోటీలకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు సరైన వివరాలను నమోదు చేయాలని, ఈ నెల 15 లోపు ఆయా అంశాలకు సంబంధించి ప్రశ్నావళికి వివరాలను ఎంపీడీవోలకు అందజేయాలని అదనపు కలెక్టర్ రాజర్షి షా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో "నేషనల్ పంచాయతీ అవార్డ్స్" విషయంపై సంబంధిత అనుబంధ శాఖల అధికారులు, డిఎల్‌పిఓలు, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రెటరీ లతో అదనపు కలెక్టర్ రాజర్షి షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 కేటగిరీలలో అవార్డులను ఎంపిక చేయడం జరుగుతుందని, అవార్డుల కోసం నిర్దేశించి ఆయా అంశాలకు సంబంధించిన ప్రశ్నావళిలో ప్రశ్నలను ఒకటికి రెండు మార్లు చదివి, పూర్తి సమాచారాన్ని సరిగ్గా నమోదు చేయాలని సూచించారు. అసమగ్ర సమాచారం, అసంపూర్త వివరాలు పూరించరాదన్నారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలలో ఎంతో పనులు జరుగుతున్నప్పటికీ వాటిని సరిగ్గా చూపించలేకపోతున్నారని అన్నారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ పై ఆధారపడటం సమంజసం కాదన్నారు. ఆయా వివరాలను పూర్తి రికార్డులతో ధ్రువీకరించుకని పూరించాలని పంచాయతీ సెక్రెటరీలకు సూచించారు. మండల స్థాయిలో ఎప్పటికప్పుడు ఆయా ఎంపీఓలు, ఎంపీడీవోలు పర్యవేక్షించాలని సూచించారు. 9 అంశాలకు సంబంధించిన వివరాలను ఆయా శాఖల అధికారులు ప్రశ్నావళిలో పూరించిన వివరాలను స్వయంగా సరిచూసుకోవాలన్నారు. ఈ పోటీలలో ప్రతి గ్రామ పంచాయతీ పాల్గొనాలని, తొమ్మిది కేటరిగలో ప్రశ్నావళి ప్రకారం సమాధానాలు నమోదు చేయాలనీ సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజర్షి షా

ఈ సందర్భంగా శాఖల వారిగా తీసుకోనవలసిన చర్యలు, అంశాల వారీగా వివరాలను పూరించడం, తదితర విషయాలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య, డిఎంఅం డ్‌హెచ్ఓ డాక్టర్ గాయత్రీదేవి, శిశు, మహిళా సంక్షేమ అధికారి పద్మావతి, ఆర్డబ్ల్యూ ఎస్, డిఆర్‌డిఓ, డిఇఓ, తదితర శాఖల అధికారులు, డిఎల్‌పిలోలు, ఎంపీఓలు, ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మునుగోడులో టిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

## పటాన్‌చెరువు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


మహిళలతో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

**పటాన్‌చెరువు, అక్టోబరు 7, ప్రభాతవార్త:** నల్గోండ జిల్లా మునుగోడు శాసన సభ ఉప ఎన్నికల్లో టిఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఘన విజయం సాధించడం తధ్యమని పటాన్‌చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మునుగోడు నియోజకవర్గం పరిధిలోని చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 1, 13వ వార్డులకు పటాన్‌చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి ఇంచార్జి బాధ్యతలను ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అప్పగించారు. శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పటాన్‌చెరువు నియోజకవర్గానికి చెందిన 25 మంది టిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో కలిసి తనకు అప్పగించిన వార్డులలో ఎన్నికల ప్రచారానికి తరలి వెళ్లి అక్కడ 13వ వార్డులో అక్కడి నాయకులతో కలిసి తన బృంధం సభ్యులతో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు, కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గడపగడపకు వెళ్లి ప్రచారం చేస్తామన్నారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం మునుగోడు తాజీ మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజలు తగు గుణపాఠం చెప్పడం తధ్యమన్నారు.


ఎన్నికల ప్రచారానికి తరలి వెళ్లిన ఎమ్మెల్యే తదితరులు

**మునుగోడు ఎన్నికల్లో ప్రచారానికి తరలివెళ్లిన ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి**

**నారాయణఖేడ్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** మునుగోడు ఉప ఎన్నికల్లో తెరాస పార్టీ తరపున ప్రచారం చేసేందుకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెరాస నాయకులతో కలిసి శుక్రవారం తరలివెళ్లారు. నల్గోండ జిల్లా మునుగోడు నియో జకవర్గంలోని నేలపట్ల గ్రామానికి ఎమ్మెల్యే ఇంచార్జిగా నియమి తులయ్యారు. ఈ సందర్బంగా నారాయణఖేడ్ తెరాస పార్టీ అధ్యక్షులు పరమేశ్వర్, మాజీ తెరాస పార్టీ అధ్యక్షులు ప్రభాకర్,ఖేడ్ మండల రైతు సమితి అధ్యక్షులు సత్యపాల్‌రెడ్డి, రవీందర్‌నాయక్,బసప్ప ఎన్నికల ప్రచారానికి తరలివెళ్లారు.


అమ్మవారి ఊరేగింపులో మాట్లాడుతున్న మేఘమాల, పాల్గొన్న భక్తులు

## అమ్మవారి దయ ఉంటే అన్నీ శుభపరిణామాలే...

జెడ్పిటీసీ మేఘమాల సంతోష్‌కుమార్

**కొల్చారం, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** అమ్మవారి దయ ఉంటే అన్ని శుభపరిణామాలే జరుగుతాయని కొల్లారం జెడ్పిటీసీ ముత్యం గారి మేఘమాలసంతోష్‌కుమార్ పేర్కొన్నారు. జెడ్పిటీసీ సొంత గ్రామామైన వరిగుంతంలో శుక్రవారం నాడు నవరాత్రులు ముగియడంతో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక వాహనంలో దుర్గాదేవి అమ్మవారిని నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ గత ఎన్నో సంవత్సరాల నుండి తమ గ్రామంలో అమ్మవారి విగ్రహాన్ని నెలకొల్పి ప్రతి సంవత్సరం పండుగ వాతావరణంలో ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, పార్టీలకు కుల మతాలకు అతీతంగా అందరినీ కలుపుకొని ముందుకు పోతున్నట్లు ఈ సందర్బంగా వారు తెలిపారు

## కులవృత్తులను అభివృద్ధిపర్చడమే బీఆర్ఎస్ లక్ష్యం

**కొత్తూర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** భారతదేశంలోఏ రాష్ట్రంలో కూడా లేనటువంటి విధంగా తెలంగాణ రాష్ట్రంలో కులవృత్తులను అభివృద్ధిపరిచేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ తెలిపారు. కులవృత్తిఅభివృద్ధిలో భాగంగా శుక్రవారం కొత్తూర్ మండల పరిషత్ కార్యాలయంలో మత్స్యకారులకు చేపల పంపిణీ కార్యక్రమం నిర్వహించి మత్స్యకారులకు చేప పిల్లలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... కులవృత్తులను ప్రోత్సహించడానికి రాష్ట్రంలోని అన్ని కులాల వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ బీఆర్ ఎస్ ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. భారతదేశంలోని ఏ రాష్ట్రంలో కూడా లేనటువంటి విధంగా తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలతో పాటు కులవృత్తులను అభివృద్ధిపరిచేందుకు అన్ని కులాలకు సహాయ సహకారం అందిస్తూ కులాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో మండల మత్స్యసహకార సంఘం అధ్యక్షులు గుండు సురేష్, గూడూరు సర్పంచ్ సత్తయ్య, ఎస్‌బిపల్లి సర్పంచ్ అంబటి ప్రభాకర్, కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, మత్స్యకార సంఘం మండల అధ్యక్షులు పెంజర్ల ఉపసర్పంచ్ పి.రమేష్, మత్స్యకారులు తదితరులు ఉన్నారు.

## పొంగిపొర్లుతున్న గంగమ్మ దేవికి ప్రత్యేక పూజలు

**కొత్తూర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కొత్తూర్ మండలంలోని కొడిచెర్ల గ్రామంలో గార్ల చెరువు నిండి అలుగు పారుతున్న సందర్బంగా గార్ల చెరువుకు స్థానిక ఎంపీటీసీ పోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... కురుస్తున్న వర్షాలకు గంగమ్మ ఉగ్రరూపంతో పొంగి పోర్లుతుంది. దీంతో చెరువులకు గండి పడకుండా ఎలాంటి నష్టం జరగకుండా రైతులకు ఎవ్వరికి ఇబ్బంది కలగకుండా చల్లగా చూడాలని గంగమ్మదేవిని వేడుకున్నట్టు తెలిపారు.వార్డు సభ్యులు నవీన్, శేఖర్, గ్రామస్థులు మోహన్‌రెడ్డి, జంగయ్య, సురేందర్‌రెడ్డి, జంగయ్య, చెన్నయ్య, నరేందర్‌జెడ్డి, రామకృష్ణారెడ్డి, దశరథచారి, శ్రీశైలంయాదవ్, మల్లేష్, రాజు, నరసింహా, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.


సదాశివపేటలో విజయదశమి సందర్భంగా పూర్వ విద్యార్థుల మిత్రుల (1983-84) బ్యాచ్ అలై-బలై కార్యక్రమం

సదాశివపేట, అక్టోబర్ 7, ప్రభాతవార్త

## మాజీ ఎమ్మెల్సీ కారును ఢీకొట్టిన డిసిఎం

కొండపాక, అక్టోబర్ 7, ప్రభాతవార్త

రాజీవ్ రహదారిపై మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్ ఇన్నోవ కారును డిసిఎం ఢీకొనగా కారు ముందటి భాగం ముందటి భాగం దెబ్బతిన్న సంఘటన కొండపాక మండలం కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొడకండ్ల గ్రామం వద్ద రాయవరం చౌరస్తాలో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్సీ ఇన్నోవ కారు సిద్దిపేట వైపు నుండి హైదరాబాద్ వైపు వెళ్తుండగా అదే సమయంలో వెనక వైపు నుండి వచ్చిన డిసిఎం వాహనం కారు ముందునుండి సడెన్‌గా రాయవరం గ్రామం వైపు వెళ్లడానికి తిప్పి ఇన్నోవ కారును డిసిఎం ఢీకొట్టింది. అ సమయంలో కారులో మంచిర్యాల మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌తోపాటు తన కుమారుడు కౌశిక్ అతని కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ సంఘటనలో కారులో ఉన్న వారందరు ప్రమాదం నుండి సురక్షితంగా బయట పడ్డారు. సంఘటన స్థలానికి కుకునూర్‌పల్లి పోలీసులు చేరుకొని ట్రిపిక్‌ను క్లియర్ చేశారు. కాగా డిసిఎంను కుకునూరుపల్లి పోలీసులు పోలీస్ స్టేషన్‌కు తరలించి డిసిఎం డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్సై పుష్పరాజ్ తెలిపారు.

## మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం

కొండపాక, అక్టోబర్ 7, ప్రభాతవార్త

తిప్పారం గ్రామం బిజెపి అధ్యక్షుడు తుడం కిషన్ సోదరుడు తుడుం లింగం ఇటివల్ల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బిజెపి మండల అధ్యక్షుడు మన్నెం శశిధర్‌రెడ్డి పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కుటుంబ సభ్యులను అండగా ఉంటామని హామి ఇచ్చారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి కుడికాయల రాములు, గజ్వేల్ టౌన్ అధ్యక్షుడు ఉప్పల మధుసూదన్, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ యాదవ్, బొబ్బాయిపల్లి అధ్యక్షుడు లింగం, తిప్పారం గ్రామ నాయకులు కోరే సంతోష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్టీ నియోజకవర్గం నాయకులు యెల్లు రాంరెడ్డి, దారం గురువారెడ్డి, ఏర్పుల వెంకటరమణ, పేర్ల శ్రీనివాస్, నందన్‌గౌడ్‌ల సహకరంతో రూ.9 వేలను మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక ససహాయం అందించారు.

# హుస్నాబాద్ యవనికపై పోటీకి సిద్ధమవుతున్న కర్ణకంటి!?

హుస్నాబాద్, అక్టోబర్, 7ప్రభాతవార్త

హుస్నాబాద్ నియోజకవర్గంలో ఎలాగైనా పోటీ చేయాలనే తలంపుతో కృతనిశ్చయంతో సామాజిక కార్యకర్త 'కర్ణకంటి మంజులారెడ్డి ఉన్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం. గతంలో కొన్నాళ్ళు తెలంగాణ ప్రభుత్వంపై నమ్మకంతో టిఆర్ఎస్ పార్టీపై కన్నేసిన మంజులారెడ్డి అనివార్యకారణాలవల్ల ఆ పార్టీకి దూరమైన కర్ణకంటి మంజలారెడ్డి కమలం ఒడిలోకి చేరాలనే కాంక్షతో తాను ఇన్నాళ్ళు చేస్తున్న సేవను వృధా కానీయకుండా పోటీకి సిద్ధమైనా బిజెపి దరికి చేరుకోలేకపోయింది.ఈ నేపథ్యంలో తన మనసులో ఉన్న కోర్కెను ఎలాగైనా తీర్చుకునే దిశగా పావులు కదుపుతున్నట్లు సమాచారం.అటు టిఆర్ఎస్ ఇటు బిజెపి దరికి చేరుకోలేకపోయిన సామాజిక కార్యకర్త మంజులారెడ్డి రంగంలో ఉండి తాను నమ్ముకున్న యువత,ప్రజలకు సేవలందించేందుకు మరింత దగ్గరయ్యేలా ఉండేందుకు అవసమైన పక్షంలో బిఎస్పి లాంటి బహుజనపార్టీ నుండి రంగంలో దిగేందుకు నిర్ణయం తీసుకుని మొగ్గు చూపి ఆ దిశగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.ప్రస్తుతం హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయిలోని మండలాలల్లోని గ్రామాలకు విరివిగా పర్యటిస్తూనే వారి బాగోగులు చూసుకుంటూ అండగా నిలుస్తూ అక ్కడి గ్రామ ప్రజల మనసుల్లో నాను తున్నారు. నియోజకవర్గంలోని హుస్నాబాద్, చిగురుమామిడి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, సైదాపూర్ మండలాల్లోని గ్రామాల్లో పర్యటిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్నారు.ఇందుకు ప్రధానంగా యువతపై మరింత ఫోకస్ చేసి జనంలోకి విస్రుతంగా వెళుతున్నారు.యువత మౌళిక అవసరాలతో పాటు వారికి ఇష్టమైనట్లుగా క్రీడానైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు తోడ్పాటునందిస్తున్నారు. యువతకు సంబంధించిన స్నేహితుల కుటుంబాల్లోనూ వారి గ్రామాల్లోనూ చితికిపోయిన కుటుంబాలకు ఆసరాగా చేయూతనందిస్తున్నారు.


కనుకదుర్గ మండపంలో మంజులరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం (ఫైల్)

## పొగాకు తాగడం మనుషులకు హానికరం

సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి

**నారాయణఖేడ్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** పొగాకుతో తయారైన వస్తువులను మనిషి ఉపయోగించడం వల్ల ఆరోగ్యానికి హానికరమని సంగారెడ్డి జిల్లా పొగాకు నియంత్ర విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఖేడ్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో గల ఆర్టీసీ బస్టాండ్ వద్ద జాతీయ పొగాకు నియంత్ర కార్యక్రమంలో భాగంగా మైకుతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల మనిషి ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని, ప్రతి ఒక్కరు పొగాకు వాడకంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరేట్, జర్దా, తంబాకు ,పాన్ మసలా లాంటివి ఉపయోగించరాదన్నారు. పొగాకు వాడటం వల్ల మనుషుల్లో హైపర్ టెన్షన్,నోటి క్యాన్సర్ , శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందన్నారు. అదే విధంగా బహిరంగ ప్రదేశాల్లో దుమపానం చేయడం సెక్షన్ 4 ప్రకారం మేరమని అందుకు రూ.200లు జరిమానా కూడా విధించడం జరుగుతుందని అన్నారు. సంగారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ఎప్పుడు రద్దీగా ఉండే ప్రదేశాల్లో నిరంతరం అవగాహన కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. పోలీసు సిబ్బంది రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 9న మహర్షి వాల్మీకి జయంతి

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబర్ 7, ప్రభాతవార్త:**

ఈనెల 9న మహర్షి వాల్మీకి జయంతి అధికారికంగా (స్టేట్ ఫంక్షన్) నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ శరత్ శుక్రవారం నాడు ఒక ప్రకటలో పేర్కొన్నారు. అక్టోబర్ 9న (ఆదివారం) ఉదయం 10:30 గంటలకు సమీకృత కలెక్టరేట్ కార్యాలయ గ్రీవెన్స్‌హాల్లో వాల్మీకి జయంతోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి జిల్లా మంత్రి, పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజలు పాల్గొనున్నట్లు తెలిపారు.

## కల్లుగీత కార్మికసంఘం మహాసభను విజయవంతం చేయండి


కరపత్రాన్ని విడుల చేస్తున్న కల్లుగీత కార్మికసంఘం నాయకులు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** ఈ నెల 10న నారాయణఖేడ్‌లో జరిగే కల్లుగీత కార్మికసంఘం రెండవ మహాసభలను విజయవంతం చేయాలని శుక్రవారం సంగారెడ్డిలో కరపత్రాన్ని గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజు గౌడ్, కల్లుగీత కార్మికసంఘం జిల్లా అధ్యక్షులు అశన్న గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు జంగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, సంగారెడ్డి మండల అధ్యక్షులు కలాలి శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు కృష్ణ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి హరీష్ గౌడ్, కృష్ణ గౌడ్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 10వ తేదిన ఉదయం 10 గంటలకు తాహసిల్దార్ కార్యాలయం నుండి ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందన్నారు. సభ్యులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

## సమాచార హక్కు చట్టం వారోత్సవాలను అధికారికంగా నిర్వహించాలి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** సమాచార హక్కు చట్టం వారోత్సవాలను ప్రభుత్వమే అధికారంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేసినట్లు సామాజిక కార్యకర్త, సమాచార హక్కు చట్టం ఉద్యమకారుడు, న్యాయవాది మహమ్మద్ నిజామోద్దీన్ రషీద్ తెలిపారు. సమాచార హక్కు చట్టం వారోత్సవాలను కొన్ని రాష్ట్రాలు, ప్రభుత్వాలే అధికారంగా నిర్వహిస్తున్నాయని, కానీ తెలంగాణ రాష్ట్రం నిర్వహించడం లేదని, అధికారంగా నిర్వహించాలని వినతిపత్రంలో కోరినట్లు ఆయన తెలిపారు.

## నేడు వటపల్లి మార్కెట్ యార్డ్‌లో అలయ్-బలయ్

**వటపల్లి, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వటపల్లిలోని మార్కెట్ యార్డ్‌లో నేడు శనివారం నాడు స్థానిక ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో దసరా ఆలయ్-బలయ్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరుకానున్నారు. కావున అందోల్ నియోజకవర్గ ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. గత నాలుగు సంవత్సరాలను నుంచి ఈ ఆలయ్-బలయ్ కార్యక్రమాన్ని విజయవంతంగా ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.

## 75వ రోజుకు చేరిన నిరవధిక సమ్మె

**కొండాపూర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో కొనసాగుతున్న విఆర్ఎల నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 75వ రోజుకు చేరింది. అందులో భాగంగా 2017 మహాశివరాత్రి రోజున ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు రాష్ట్ర నాయకులను పిలిచి వీఆర్వో వ్యవస్తను రద్దు చేసుకుంటూ మీకు ఉద్యోగ భద్రత కల్పిస్తానని, మీకు పేస్కేల్ ఇస్తానని 50 సంవత్సరాలు కలిగిన వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు, హర్హత కలిగిన వీఆర్ఏలకు ప్రమోషన్లు ఇస్తానని వాగ్దానం చేసిందు. అదే విధంగా రెండు సార్లు 2020-2022న జరిగిన అసెంబ్లీ సభలో పైన తెలిపిన వాగ్దానాలు చేసిందు. ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికీ నేర వేర్చలేదు కావున రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ 13న 6000 మందితో అసెంబ్లీ మట్టడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది.విఆర్ఏలు మండల అధ్యక్షులు టి కుమార్, ప్రధాన కార్యదర్శి మన్నే శ్రీశైలం, ఉపాధ్యక్షులు లింగమయ్య, కార్యదర్శి బాలరాజ్, గోపాల్, సుభాష్, నాయకులు కిష్టయ్య, మైబెల్లి లక్ష్మయ్య, అనంతయ్య, రాములు పాల్గొన్నారు.

## నేడు ఘట్‌కేసర్‌లో దుర్గామాత శోభాయాత్ర

**ఘట్‌కేసర్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పట్టణంలో శనివారం దుర్గామాత శోభాయాత్ర జరుగనుంది. దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గామాతను ప్రతిష్టించి 9 రోజుల పాటు నిత్యం వివిధ రూపాలలో అమ్మవారిని అలంకరించి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం అమ్మవారి శోభాయా త్ర పెద్దఎత్తున జరుగనుండటంతో ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి పాల్గొననున్నారు. ఎదులాబాద్‌రోడ్డులో నాగులమ్మ వద్ద మాజీ వార్డుసభ్యులు మామిండ్ల ముత్యా లుయా దవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను పట్టణంలో ఊరేగించి శోభాయాత్ర నిర్వహించేందుకు తగిన సన్నాహాలు చేస్తున్నారు.

**రెండవ కోహర్ట్ ఆఫ్ రైజ్ గ్లోబల్ విజేతలను వెల్లడించిన ష్మిత్ ఫ్యూచర్స్**

ష్మిత్ ఫ్యూచర్స్,రోడ్స్ట్రస్ట్‌తో భాగస్వామ్యం చేసుకుని రెండవ కోహర్డ్ 100రైజ్ గ్లోబల్ విజేతలను ప్రకటించింది. ఈ సందర్భంగా ష్మిత్ ఫూచర్స్ కో-ఫౌండర్,ఎ రిక్ ష్మిత్ మాట్లాడుతూ తాము అసాధారణమైన ప్రతిభావంతులకోసం ప్రపంచవ్యాప్తంగా వెదుకుతున్నామన్నారు. ఎందుకంటే మేధావులు ఈ ప్రపంచం మెరుగు పడటంలో అసాధారణ ప్రభావం చూపగలరన్నారు. అదే సమయంలో ఈ ప్రపంచం ఎదుర్కొంటున్న అతిక్లిష్టమైన సమస్యలకు సైతం తగిన పరిష్కారాలను చూపగలరాన్నారు. ష్మిత్ ఫూచర్స్ అండ్ ష్మిత్ ఫ్యామిలీ ఫౌండేషన్ అధ్యక్షుడు కోఫౌండర్ వెండీష్మిత్ మాట్లాడుతూ రైజ్ విజేతలను ప్రకటించడమన్నది ఈ ప్రక్రియ ముగింపులో భాగంకానుంది. ఈ ప్రోగ్రామ్‌లో భాగమైన యువత తమ కార్యకలాపాలఆరంభానికి సూచిక అన్నారు.